క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆందోళన



ఉదయగిరి: ఉపాధి హామీ పనులు కల్పించాలని బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని కృష్ణారెడ్డిపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ 8 నెలలుగా గ్రామంలో ఉపాధి పనులు కల్పించకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయ పనులు కూడా లేక కుటుంబ పోషణ భారమై ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

విజయదీపికల పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు విజయదీపిక పుస్తకాలను ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థినులు కష్టపడి చదవి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ తహసీన్ సుల్తానా, ఉపాధ్యాయులు నాగమణి, దమ్ము పద్మ, గుండాల బుజ్జిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉదయగిరి: స్థానిక దిలావర్‌భాయి వీధికి చెందిన షేక్ సంధాని, షాహీన దంపతులతో పాటు చెక్కనగిషి కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్‌హుస్సేన్‌ను మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ మండలాధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ చెక్కనగిషి కేంద్రంలో పనిచేస్తున్న షాహీన కళా నైపుణ్యాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానించడం సంతోషకరమన్నారు. చెక్కనగిషి కేంద్రం ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్న జాకీర్‌హుస్సేన్‌ను అభినందించారు. చెక్కనగిషి కేంద్రానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరించి అభివృద్ధి చేస్తే మరింతమంది మహిళలు ఉపాధి పొందడంతో పాటు వారి చేతుల నుంచి అద్భుతమైన కళాఖండాలు ఉద్భవిస్తాయన్నారు. సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్‌రజాక్, మాలిక్, బాలకృష్ణ, అరాఫత్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వైజాగ్‌కు చెందిన ప్రముఖ ధ్యాన మాస్టర్ భీమినేని వంశీకిరణ్ తెలిపారు. పట్టణంలోని షిర్డీసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రత్యేక ధ్యాన శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ధ్యాన మాస్టర్ వంశీకిరణ్ ధ్యాన సాధన, ఆధ్యాత్మిక చింతన, శాకాహారం భుజించడం అలవర్చుకోడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని తెలిపారు. ధ్యాన శిక్షణ కేంద్రం నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

- సిబ్బంది ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం

మర్రిపాడు: మండల వెలుగు కార్యాలయాన్ని ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వెలుగు సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో లేరు. ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమిచ్చాయి. హాజరు రిజిష్టర్ సైతం అందుబాటు లేదు. సిబ్బంది కోసం దాదాపు గంట పాటు ఎంపీడీఓ కార్యాలయంలో ఎదురుచూసినా ఎవరూ రాలేదు. దీంతో వెలుగు సిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆశీర్వచనం

ఆత్మకూరు: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ మహబూబ్‌బాషా, జమ్రుల సోదరుడు అన్సర్ వివాహం ఇటీవల జరగగా వారింటికి వెళ్లి నూతన దంపతులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ప్రయాణం నరకప్రాయం

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- సంక్రాంతికి గుంతలు లేకుండా చేస్తామన్న ప్రభుత్వ హామీ గాలికి
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

అధ్వానంగా వింజమూరు - ఆత్మకూరు రోడ్డు



ఉదయగిరి: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా గ్రామీణ రహదారుల దుస్థితి మారలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్ల లేని విధంగా అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండగ నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంత రోడ్ల రూపురేఖలు మారలేదు. ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 143 పంచాయతీలు, 300 వరకు మజారా గ్రామాలు ఉన్నాయి. అనేక పల్లెలకు నేటికి సక్రమంగా రోడ్లు లేని పరిస్థితి ఉంది. పాలకులు, అధికారులు మారుతున్నా పల్లె రోడ్ల పరిస్థితిలో మార్పు రావడంలేదు. అధ్వానంగా ఉన్న రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లుపై ఉన్న గుంతల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. రోడ్లు బాగా లేని పల్లెలకు బస్సులు, ఆటోలు రావడం లేదు. దీంతో ప్రజలు బైక్‌లపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మండల కేంద్రాలతో పల్లెలను కలిపే అనేక రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగిపోయి ఉన్నాయి. జంగిల్ క్లియరెన్స్‌ను చేపట్టడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రాకపోకల సమయంలో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు.

- ఆత్మకూరు-వింజమూరు రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థ పడుతున్నారు.
- వింజమూరు-చాకలకొండ-పామూరు రోడ్డులో ఇరవై గ్రామాల ప్రజలు నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉంది. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో పునర్నిర్మించకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు మండలాలను కలిపే జనార్దనపురం-వరికుంటపాడు రోడ్డు మార్గంలో రామదేవులపాడు సమీపంలోని చింతమాను వాగుపై చప్టా లేక వర్షాకాలంలో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.
- ఉదయగిరి- బండగానిపల్లి మార్గంలో ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం సుమారు 20 గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. మూడు కి.మీ దూరం అటవీ అనుమతులు లేక రోడ్డు నిర్మాణానికి వీలు కాలేదు. ఏ ప్రభుత్వం వచ్చిన వారి బాధలు మాత్రం తీరడం లేదు.
- కొండాపురం-కావలి రోడ్డులో గుంతలు పూడ్చే నిమిత్తం పలుచోట్ల బాగున్న రోడ్డును సైతం తవ్వివదిలేశారు. సంక్రాంతి ముగిసినా తారు వేయకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు నరకం చవిచూస్తున్నారు.

చప్టా నిర్మించాలి



చాకలకొండ నుంచి వరికుంటపాడు వెళ్లే మార్గంలో రామదేవులపాడు వద్ద వాగుపై చప్టా నిర్మించాలి. ఇక్కడ చప్టా లేని కారణంగా వర్షా కాలంలో వాగు వస్తే మూడు మండలాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కనీసం ద్విచక్రవాహనంపై కూడా వెళ్లేలేని పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా మా ఊరి రోడ్డు రాత మాత్రం మారడం లేదు.

–రాంబాబు, ఉపాధ్యాయుడు, రామదేవులపాడు

ఘాట్‌రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



ఉదయగిరి–బండగానిపల్లె ఘాట్‌రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. మూడు కి.మీ దూరం ప్రయాణానికి గంట పడుతోంది. ప్రభుత్వాలు, పాలకులు మారిన ఘాట్ రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. 20 గ్రామాల ప్రజలు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఘాట్ రోడ్డును పూర్తి చేయాలి.

– సిద్దు రామిరెడ్డి, కొత్తపల్లె

అభివృద్ధికి నోచుకోని రోడ్లు

- వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లి, ఎస్‌బీకాలనీ, అశోక్‌నగర్, కాకొల్లువారి పల్లె, హుస్సేన్‌నగర్, కొండ్రాజుపల్లె, చెన్నంపల్లె.
- దుత్తలూరు మండలం బండకిందపల్లె, తిమ్మాపురం, వెంగనపాళెం, పాపంపల్లె.
- జలదంకి మండలం రామవరప్పాడు, అన్నవరం, గమ్మినపాళెం, కమ్మవారిపాళెం.
- ఉదయగిరి మండలం గుడినరవ, జెట్టివారిపల్లె, ఆర్లపడియ
- కొండాపురం మండలం రామానుజపురం, కుంకువారిపాళెం, తూర్పుపాలెం,
- వింజమూరు మండలం జనార్దనపురం నుంచి రామదేవులపాడు, వెంగనపాళెం, వన్నెవారిపాళె, నల్లారెడ్డిపల్లె.



దుత్తలూరు చెరువు కట్టపై తారులేచిపోయి కంకర తేలిన రోడ్డు

గిడుగుకు నివాళి



సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రాంధిక భాషగా ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకురావడానికి గిడుగు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు మహేష్, మదీనా, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10:30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఫేక్ యాప్‌తో మోసంపై ఫిర్యాదు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలో ఉన్న మద్యం దుకాణంలో నగదు చెల్లింపు విషయంలో ఓ మైనర్ బాలుడు ఫేక్ యాప్‌ను ఉపయోగించి మోసం చేసినట్లుగా నిర్వాహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మైనర్ బాలుడ్ని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా గృహాలు మారాలి

కావలి: గృహాలు, కార్యాలయాలు సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మారాలని కావలి విద్యుత్ శాఖ డీఈ రవికుమార్‌రెడ్డి, ఏఈ వై వసంతరావు అన్నారు. పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీలో సౌర విద్యుత్‌పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లపై సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సైతం పొందవచ్చని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకునే వారికి కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలో వాట్లకు రూ.78వేలు రాయితీని అందజేస్తోందని తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే రాయితీ నగదు ఖాతాల్లో జమవుతుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

సౌరవిద్యుత్ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణాన్ని సైతం పొందవచ్చని వివరించారు. ఇంటి అవసరాలకు పోను మిగిలిన సౌర విద్యుత్‌ను విద్యుత్‌శాఖకు విక్రయించుకునే వీలుంటుందన్నారు. ఇందుకు యూనిట్‌కు రూ.2.90 చొప్పున ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యుత్‌శాఖ నగదు చెల్లిస్తుందని తెలిపారు. సుమారు నాలుగైదేళ్లలోపు పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చేస్తుందని, మూడు కిలో వాట్ల ప్యానళ్ల ఏర్పాటు వరకు మాత్రమే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి

ఆత్మకూరు: వాహనచోదకులు రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీ రాములు, సీఐ జీ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆర్డీఓ పావని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్‌బెల్టులను విధిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కాగా పోలీసు స్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట, బీఎస్సార్ సెంటర్ల మీదుగా మున్సిపల్ బస్టాండ్ వద్దకు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్మించారు. ఎంవీఐ రాములు, సీఐ గంగాధర్‌లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత నిబంధనలపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బీ సాయి ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎన్‌జీఓ నేతలు వాగాల శ్రీహరి, పయ్యావుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ పావని

పరామర్శ

ఆత్మకూరు/సంగం/సోమశిల: ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. నెల్లూరులో జరిగిన సంగం మండల మాజీ జెడ్పీటీసీ తుంగా ఇందూధర్‌రెడ్డి ఉత్తర క్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఇందూధర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుమారుడు కార్తికేయరెడ్డి, కుమార్తె జస్మితను పరామర్శించారు. ఇందూధర్‌రెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

- అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి కుమారుడు జయరావర్ధన్‌రెడ్డి ప్రమాదవశాత్తు గాయపడిన నేపథ్యంలో నెల్లూరులోని వారి నివాసానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే మేకపాటి పరామర్శించారు.
- ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల మేనేజర్ సయ్యద్ జమీర్, వార్డు కౌన్సిలర్ నౌషాద్‌బేగం కుమారుడు జహీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. జహీర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఓదార్చారు. ఆయన వెంట పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్, డాక్టర్ కుమార్, ఆత్మకూరు, సంగం మండలాధ్యక్షులు జితేంద్రనాగ్‌రెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, ఎంపీటీసీ ముడి మల్లికార్జునరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, సురేష్‌యాదవ్, బాలఅంకయ్య, కే కిషోర్, కలాం, మోహన్‌రెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి, బాలానాయుడు, కోటారెడ్డి, ఫణి, సర్పంచ్ మానికల చందు, రవీంద్రబాబు, కృష్ణయ్య, సుధీర్, పర్వీన్, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.



ఇందూధర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

నూరు శాతం అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో నూరుశాతం అక్షరాస్యతను సాధించడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌కు సంబంధించిన పుస్తకాలు, ఇతర సామగ్రిని వలంటీర్లకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వలంటీర్లు తమకు కేటాయించిన నిరక్షరాస్యులకు అక్షరాలను నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సూపర్‌వైజర్లు బాదుల్లా, ఏపీఎం కృష్ణారావు, సీసీలు సునీత, సుశీల, లక్ష్మీకుమారి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కావలి: రబీ పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. కావలి రూరల్ మండలం రుద్రకోటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం తరఫున జిల్లా యంత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కోసం అనుమతి తీసుకుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు పంట నమోదు తప్పనిసరని వివరించారు. ఏడీఏలు ఏ నర్సోజీరావు, సీహెచ్ నాగరాజు, ఉద్యాన శాఖ అధికారిణి పీ సుధామయి, కావలి ఏఓ ఏ లలిత, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా పుట్టం ఎంపిక

మర్రిపాడు: మండలంలోని చాబోలు సర్పంచ్ పుట్టం శ్రీనివాసులరెడ్డి జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు కేంద్ర ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



పుట్టం శ్రీనివాసులరెడ్డి

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి: కావలి విద్యుత్ డివిజన్ పరిధిలోని అల్లూరు సబ్ డివిజన్ కార్యాలయంలో ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు కావలి డీఈఈ కేఎస్ బెనర్జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అదాలత్ చైర్మన్, విశ్రాంతి జడ్జి వీ శ్రీనివాసఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కేవీ రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీకుమార్‌తో పాటు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది హాజరవుతారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని ఊటుకూరు, నందిగుంట సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం చేపట్టారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డులు నమోదు చేశారు. ఆధార్‌లోని పేర్లు మార్పు, పుట్టినతేదీ సవరణలు, అడ్రస్‌లో మార్పులు చేశారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు సర్పంచ్ వెంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు షకీల పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలి

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): రబీ పంట సాగు చేసిన రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని అనుమసముద్రంపేట ఏఓ రజనీ సూచించారు. అనుముసముద్రంపేట మండలం చౌటభీమవరం, రాజవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఏఓ క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై సూచనలు చేశారు. రైతులు సామూహికంగా ఎలుకల మందును పెడితేనే వాటి నివారణ సాధ్యమన్నారు. బ్రోమైడ్ మందును బియ్యం, ఇతర గింజలు, వంటనూనెలో కలిపి ఎలుకల కలుగుల వద్ద ఉంచాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. వరిపైరులో అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేస్తే తాలు గింజ సమస్య రాదన్నారు. ఏఈఓ కే చిరంజీవి, వీఏఏ మోహన్ కృష్ణ, విజయమ్మ, చౌటభీమవరం సర్పంచ్ లక్ష్మీనరసయ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ రజనీ

సీపీఎం రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

సోమశిల: నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం రాష్ట్ర మహాసభలపై చేపట్టిన ప్రచార కళాజాతా అనంతసాగరానికి బుధవారం చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం జెండాను మండల కమిటీ సభ్యుడు డాక్టర్ సుబ్బారాయుడు ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, గాడి సుధాకర్, డాక్టర్ సుబ్బరాయుడు మహాసభలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, మండల కమిటీ సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, జక్రయ్య, మీరా మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై పంచాయతీల పాలకవర్గాలు ప్రత్యేక దృష్టి సారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఈఓపీఆర్డీ భార్గవి సూచించారు. మండలంలోని బాలాయపల్లి, బసినేనిపల్లి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. చెత్తను వర్మికంపోస్టుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం బసినేనిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు జీవన్‌కుమార్, ప్రేమ్‌కుమార్, గోపి, సచివాలయ సిబ్బంది, గ్రీన్‌అంబాసిడర్లు ఉన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ భార్గవి

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి



సంగంలో పశుఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశువైద్యాధికారి సురేష్



ఉదయగిరి: వింజమూరులో నట్టల నివారణ మందు పంపిణీ

ఆత్మకూరురూరల్: పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని చెర్లోయడవల్లిలో పశుఆరోగ్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పశువైద్య సిబ్బంది పాడి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏడీఏ డాక్టర్ జయచంద్ర, సర్పంచ్ చేరెడ్డి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నేరేడుపల్లిలో పశుఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పశువైద్య సిబ్బంది 90 పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. 500 జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి రఘునాథ్, వెటర్నరీ అసిస్టెంట్లు రాజశేఖర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని గంగవరంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు చూడి పరీక్షలు చేయడంతో పాటు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందజేశారు. అనంతరం నట్టల నివారణ మందుతో పాటు ఖనిజ లవణ మిశ్రమాన్ని పాడి రైతులకు అందజేశారు. గోకులాలు, పశుగ్రాస ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. నెమళ్లదిన్నె సర్పంచ్ రామచంద్ర, డీఎల్‌డీఏ టీఓ శ్రీనివాసరావు, ఉదయగిరి వెటర్నరీ ఏడీ శశిధర్, ఎల్‌ఎస్‌ఏ షంషుద్దీన్, వీఏ మాలాశ్రీ, ఏహెచ్‌ఏ శైలేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలోని తలుపూరుపాడులో పశువైద్యాధికారి సురేష్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, పశుగ్రాస పెంపకం, టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.